16న స్కాలర్‌షిప్ టెస్ట్

చిక్కడపల్లి: ప్రముఖ శ్రీరామ్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 16న ఉదయం 10.30గంటలకు యూపీఎస్సీ–2026 ప్రిలిమ్స్, మెయిన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కోసం అతిపెద్ద ఏపీఎస్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ రాఘవ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టాప్ 20 ప్రతిభ సాధించిన వారికి కోర్సు ఫీజుపై 50శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. టాప్ 50లో ఉన్న వారికి 30శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా తమ పేర్లను ఆర్టీసీక్రాస్ రోడ్డులోని జవహర్‌నగర్ శ్రీరామ్స్ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన 40రోజుల ఉపవాస దీక్షలు

ముషీరాబాద్: రాంనగర్ ప్రార్థన వీరుల చర్చ్‌లో 40 రోజుల పాటు నిర్వహించిన ఉపవాస దీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు, యేసుప్రభూ భక్తిగీతాల ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్ మేరీలీనా మాట్లాడుతూ.. 27ఏళ్లుగా చర్చ్‌లో ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కవాడిగూడ: స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని జిప్స్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ నిరంజన్ కోరారు. మంగళవారం కవాడిగూడ తాళ్లబస్తీలో జిప్స్ సంస్థ సహకారంతో వైఫోర్‌డి ఫౌండేషన్, జనని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనని ఫౌండేషన్ అధ్యక్షుడు రాచకొండ మల్లేష్‌బాబు, వైఫోర్‌డీ ప్రతినిధులు సూర్య, అరవింద్, శ్రీనివాస్, లక్ష్మి, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాలి

పంజగుట్ట: ఈడబ్ల్యూఎంఎస్ రిజర్వేషన్లలోనూ వర్గీకరణ చేపట్టాలని వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా కోరారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో వైశ్యుల వాటా తేల్చాలి అనేఅంశంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చట్టసభల్లో వైశ్యులకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, రానున్న స్థానిక సంస్థల్లో తగిన వాటా కల్పిస్తే తాము నిరూపించుకుంటామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో తమ జనాభా 4 శాతం ఉన్నట్లు తేలిందని కానీ ప్రస్తుతం నిర్వహించిన సర్వేలో తక్కువచేసి చూపుతున్నారని మళ్లీ కుల గణన సర్వే చేపట్టిన తమ జనాభాను తేల్చాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారని, వైశ్యులకు ఎంత ఇస్తారో తెలపాలని న్నారు. త్వరలోనే హైదరాబాద్ వేదికగా వైశ్య రాజకీయ రణభేరీ నిర్వహిస్తామని తెలిపారు.

'మహాదేవ మణి' కవిత్వం శాస్త్రీయమైనది

కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరావు



చిక్కడపల్లి: 'మహాదేవ మణి'కవిత్వం దివ్యమైనదని, శాస్త్రీయమైనదని ప్రముఖకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరావు అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి ఉపాసన సంస్థ ఆధ్వర్యంలో బృహత్ శ్రీధరీయం కావ్యాన్ని ఆవిష్కరించారు. మహాదేవ మణి రచనలు చేయటమే కాకుండా ఎందరో కవులు, అవధానులు అయ్యేందుకు దోహదపడిన బ్రహ్మర్షి అని ప్రశంసించారు. తెలుగు భాష అంతరించిపోతున్న సందర్భంలో భాషా పరిరక్షణకు కంకణం కట్టుకున్న సంస్కృతి మణి మహాదేవ మణి అని కొనియాడారు. గ్రంథ సమీక్ష చేసిన సాహితీవేత్తలు ఎం.సూర్యనారాయణ మూర్తి గుండె మండినప్పుడు కవిత్వం వెలువడుతుందన్నారు. ఛందస్సు కోసం పద్య రచన కాకుండా విషయ ప్రాధాన్యంతో మహాదేవ మణి రచన చేశారని అన్నారు. భాషా పండితులు శ్రీరామ్‌నాథ్ మాట్లాడుతూ.. అనుభూతి చెంది కవిత్వం రాస్తే మహాదేవ మణి కావ్యంలా ఉంటుందని అన్నారు. సాహితీవేత్తలు ఎం.దత్తత్రేయశర్మ, ఎం.వెంకటరమణశర్మ, అవధాని బులుసు అపర్ణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ సీతాపతి, కల్యాణి, దివాకర్‌రావు ఉపాసన అవార్డుతో మహాదేవ మణిని సత్కరించారు.

రేషన్ కార్డులకు క్యూ..

- కిటకిటలాడిన బంజారాహిల్స్, ఖైరతాబాద్ సెంటర్లు
- సరైనా పత్రాలతో రావాలని అధికారుల సూచన

మీ-సేవా కేంద్రాలకు పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న మీ-సేవా కేంద్రం నిర్వాహకులు

బంజారాహిల్స్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు మీ–సేవా కేంద్రాలకు క్యూ కట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లోని మీ–సేవా కేంద్రంతో పాటు ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయ ఆవరణలోని సెంటర్ల వద్ద ఉదయం నుంచే బారులుదీరారు. కొత్త కార్డుతో పాటు ప్రస్తుత కార్డులో కొత్తపేర్లు చేర్చాలని ఆధార్‌తో పాటు కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లును జతచేసి దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది సైతం అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బంజారాహిల్స్‌లోని మీ–సేవా కేంద్రానికి ఒక్కరోజే దాదాపు 1000 మంది వరకు, అలాగే బస్తీలు, కాలనీల్లోని మీ–సేవా కేంద్రాలకు కూడా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరికొద్ది రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిబ్బంది తెలిపారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలోని 81 రేషన్ షాపుల పరిధిలో కొత్తగా రేషన్ కార్డు కోసం మీ–సేవా కేంద్రాలకు వెళ్లి సదరు దరఖాస్తు ఫారానికి సంబంధిత డాక్యుమెంట్లు జతపరిచి ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సర్కిల్–7 పరిధిలో 83,013 రేషన్‌కార్డులు..

ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో 81 రేషన్ షాపులు ఉండగా ప్రస్తుతం వీటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 79,531, అంత్యోదయ అన్నయోజన కార్డులు 3481, ఒక అన్నపూర్ణ కార్డు కలిపి మొత్తం 83,013 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 2,92,882 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో మొత్తం ప్రతినెలా 18,19,011 కిలోల రేషన్ బియ్యం అందిస్తున్నారు.

కొత్తవారికి ఈ నెల రేషన్ లేనట్లే..

ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో గత నెల 6,093 మందిని అర్హులుగా గుర్తించి సర్వే చేయగా ఇందులో 2,938 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలో నూతన లబ్ధిదారులకు ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. ఈనెల కూడా వారికి రేషన్ లేనట్లేనని తెలుస్తోంది.

ఎస్సీ వర్గీకరణ చేయడం చరిత్రాత్మకం

బంధు సొసైటీ గౌరవ అధ్యక్షుడు భరత్‌భూషణ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌భూషణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎస్సీ వర్గీకరణకై అడ్డుపడే వారితో రాజకీయంగా ఎన్ని రకాల ఒత్తిడి ఉన్న అన్నింటిని తట్టుకొని ఎస్సీ వర్గీకరణ చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయమని బంధు సొసైటీ గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి భరత్ భూషణ్ అన్నారు. ఎస్సీల తరపున సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు ప్రత్యేక కమిటీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లేల వీరస్వామి అధ్యక్షతన మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. అంతర్గత సమస్యలు పరిష్కరించుకుంటూ భవిష్యత్‌లో హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ వర్గీకరణ పద్ధతిలోనే గ్రూప్–1, 2, 4 ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నరసింహ, ఆంజనేయులు, కోలా జనార్దన్, రాజగోపాల్, దయానంద్, లావణ్య, కృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి



కార్పొరేటర్ ఉమారాణి దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నేత లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో వందకు పైగా సీట్లను గెల్చుకుని గ్రేటర్ పీఠంపై బీజేపీ జెండా ఎగురవేస్తామని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. కాచిగూడ కార్పొరేటర్‌గా కన్నె ఉమారాణి బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లయిన సందర్భంగా నింబోలిఅడ్డలోని పార్టీ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి తదితరులు కార్పొరేటర్ కన్నె ఉమారాణి దంపతులకు సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికులవలే కృషి చేయాలన్నారు. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు నేటి నుంచే పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. బీజేపీలో బూత్ స్థాయి నుంచి పార్టీ బలంగా ఉందని తెలిపారు. బీజేపీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన నెంబర్ వన్ పార్టీగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తలు ఉండడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, పార్టీ నేతలు డాక్టర్ జి.సమత, శ్యామ్‌రాజ్, కేసరి నర్సింగ్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఆర్‌విఎల్ రమేష్, లక్ష్మపురి సత్యనారాయణ, ఎం.కృష్ణంరాజు, మధుసూదన్‌యాదవ్, బల్వీర్, హజారిబాబు, యశ్వంత్, ప్రవీణ్, శ్రీధర్, జోషి, భీమ్‌రాజు, మల్లికార్జున్, రమాదేవి, రవియాదవ్, సంతోష్, లావణ్య, సారిక, శాంతాబాయి, తారా, ప్రశాంత్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలను ఒకే గ్రూపులో చేర్చాలి

పంజగుట్ట: ఎస్సీ 57 ఉపకులాలను ఏ గ్రూపులోనే చేర్చాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం ఇచ్చామని, అయినా ఉపకులాలను మూడు ముక్కలుగా చేయడం బాధాకరమని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ఉపకులాల సంఘాల నాయకులతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఎస్సీ 57 ఉపకులాలను ఒక్కచోటే చేర్చి జనాభా దామాషాప్రకారం 6 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అంతేగాకుండా ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. అలాగే రాజకీయంగా కూడా ఇప్పటివరకు ఉపకులాలకు పెద్దగా న్యాయం జరగలేదని రాజకీయాల్లోనూ ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచి మూడు గ్రూపులకు ఒక్కో శాతం చొప్పున కేటాయించాలని విన్నవించారు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు గుర్తింపుకార్డుల పంపిణీ



టెక్నీషియన్లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్‌కు గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై గుర్తింపుకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమకు డబుల్ బెడ్‌రూమ్, తెల్ల రేషన్ కార్డులు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అసోసియేషన్ ఏర్పాటుకు ముషీరాబాద్ మండలంలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఏర్పాటుకు ముషీరాబాద్ మండలంలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా పని చేస్తున్న ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు. అవసరమైతే టెక్నీషియన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రఘు, విఠల్‌ప్రసాద్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శులు సిద్దు, ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ కుమర్, కార్యనిర్వాహక కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

ఆదినారాయణకు సన్మానం

లిబర్టీ: సామాజిక సేవ చేస్తున్న ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణను ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవ శాంతి సామరస్యం పలు పర్వదినాలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

పంజగుట్ట: భారతదేశాన్ని నిర్వీర్యం చేసేందుకు కొన్ని విదేశీ శక్తులు పథకం ప్రకారం మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు ఇక్కడికి పంపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. వికాస భారతి ఆధ్వర్యంలో అధ్యక్షుడు డాక్టర్ పాండురంగారావు అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'సే నో టు డ్రగ్స్' పేరుతో మాదకద్రవ్యాలు తీసుకుంటే కలిగే నష్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, మాజీ ఐఏఎస్‌లు పద్మనాభరెడ్డి, ఎం.వి.రెడ్డి, లోక్‌సత్తా నాయకుడు దోసపాటి రాము, డాక్టర్ దేవేందర్ సింగ్, వికాస భారత్ ప్రతినిధులు తాటి శ్రీనివాస్, వి.నరోత్తమ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. స్కూల్ నుంచే పిల్లలకు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు అమ్మి వారిని అలవాటు చేస్తున్నారన్నారు. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వాల మీదే భారం వేయకుండా ప్రతిఒక్కరూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

లిబర్టీ: పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సందానందు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకుంటున్న ఒక్కో నిర్ణయం పేద, బడుగు బలహీన, దళిత బహుజన జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుకను సరఫరా చేస్తామని ప్రకటించడం అభినందనీయమని దీనివల్ల దళిత, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి

లిబర్టీ: ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకుడు అనేక చిత్రాల్లో పాటలు పాడి తెలుగు ప్రజల మనస్సు దోచుకున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేణు, నాగిళ్ల నవీన్‌కుమార్, పుష్పాంజలి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'సెల్ట్'లో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ అనుబంధ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజెస్ ట్రైనింగ్ (సెల్ట్)లో స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 10 ఆ పైన విద్యార్హత గల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు, తదితరులు అర్హులని డైరెక్టర్ ప్రొ.సొడ నవీన్ పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పూజారి రంగరాజన్‌పై దాడి అమానుషం

టీబీఎస్ఎస్ సురేష్ చందర్‌రావు



నల్లకుంటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీబీఎస్ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధానార్చకుడు రంజరాజన్‌పై దాడి జరగడం దారుణమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ(టీబీఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ చందర్‌రావు అన్నారు. ఈ పాశవిక చర్యను ఖండిస్తున్నామని అన్నారు. మంగళవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దైవ సన్నిధిలో జీవనాన్ని సాగిస్తున్న ఒక బ్రాహ్మణుడి కుటుంబం పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పూజారిపై దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఏ ముసుగులో ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేవలం అరెస్టులతో సరిపెట్టకుండా కఠిన శిక్ష పడేలా పోలీసులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే రంగరాజన్ కుటుంబానికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోని తమ సంస్థ ప్రతినిధి బృందంతో రంగరాజన్ కుటుంబాన్ని కలుస్తామన్నారు. ఆ పూజారి కుటుంబానికి బ్రాహ్మణ సమాజం అండగా ఉంటుందని చెప్పారు.

- టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ.. నిత్యం భగవంతుని సేవలో తరించే ఓ బ్రాహ్మణుడిపై దాడిని ఖండిస్తున్నామని న్నారు. ఈ దాడి బ్రాహ్మణ సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోందని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ పూజారులకు పూర్తి రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీబీఎస్ఎస్ ప్రతినిధులు భగవంత్ రావు, నెల్లుట్ల ప్రకాష్ రావు, రాజమోహన్ రావు, బాచరాజు శ్రీనివాసరావు, దేవులపల్లి రంగారావు, చెన్నూరి లక్ష్మి నరసింహా రావు, మంత్రి సునీల్, దేశ్‌ముఖ్ రాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం



ఫ్రెండ్స్‌కాలనీలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: వీధిదీపాల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కాలనీకి ఆహ్వానించి స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. విద్యుత్ దీపాలు వెలగడం లేదని, టైమర్‌లు పని చేయడం లేదన్నారు. కాలనీలోని పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఫిర్యాదు చేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టడం వల్ల వీధులు చిన్నవిగా అయ్యి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఫోన్‌లో సమస్యలను వివరించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. వీధి దీపాల నిర్వహణలో సంబంధిత కాంట్రాక్టర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు పనులు చేయడం లేదని అన్నారు. ఫ్రెండ్స్‌కాలనీ పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాచ్‌మెన్‌ను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పూస గోరఖ్‌నాథ్, ముచ్చకుర్తి ప్రభాకర్, శివముదిరాజ్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, ఎయిర్‌టెల్ రాజు, సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ



ముషీరాబాద్ మీసేవలో రేషన్‌కార్డు దరఖాస్తులను అందజేసేందుకు వచ్చిన జనం

ముషీరాబాద్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో ముషీరాబాద్‌లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. దరఖాస్తు వెంట కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, విద్యుత్ బిల్లు స్కాన్ చేసి స్వీకరించారు. రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఈనోటా ఆ నోటా ప్రజలకు తెలియడంతో మీసేవ కేంద్రాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మీసేవా కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ఒక్క ముషీరాబాద్ మీసేవా కేంద్రంలోనే 240 దరఖాస్తులను స్వీకరించినట్లు మీసేవా ఇన్‌చార్జి 'సాక్షి'కి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో ఈనెల 8న ప్రారంభమైన అఖిల భారత శ్రీరామనామ కోటిలేఖన మహా సంఘం వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం మహిళలు సుందరకాండ, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులకు రామాయణంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాయంత్రం సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాస శర్మ వీణావాద్య కచేరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో మహా సంఘం అధ్యక్షుడు ఆర్ఎస్.రంగదాసు, కార్యదర్శి కేవీ.తిరుమలరావు, కోశాధికారి పి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మురళీకృష్ణతో పాటు సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల పూజలో కోటిలేఖన మహాసంఘం ప్రతినిధులు



పోపూరి శ్రీనివాసశర్మ వీణావాద్య కచేరి దృశ్యం

ప్రేక్షక రంజకం.. బుర్రకథ గానం



యెడ్ల ప్రేమేందర్ బృందాన్ని సన్మానిస్తున్న కళా జనార్దనామూర్తి, బండి శ్రీనివాస్

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ నిర్వహణలో మంగళవారం యెడ్ల ప్రేమేందర్ బృందంచే మంగళవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై బుర్రకథ గానం ప్రేక్షక రంజకంగా సాగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.